కథా నిలయం
4747
శ్రీకాకుళం

# దూరపు కొండలు

"ఏవిటీ నన్ను కూడా గుర్తించకుండా అంతగా మైమఱచి చూస్తూన్న దృశ్యం ఏముందబ్బా అక్కడ ?" భార్యకు దగ్గఱగా వచ్చి భుజంపై చేయి వేస్తూ రఘుపతి తానూ చూచాడటు.

అప్పటికి ఈ ప్రపంచంలోనికి దిగి వచ్చిన మాలతి కుర్చీలోంచి మెల్లగా లేచింది. "వచ్చారా? కాఫీ తెస్తాను," అంటూ తప్పుకో బోయిందక్కడినుంచి.

"కాఫీకి తొందర లేదు లే." కిటికీ తెఱలు సరిజేసి వచ్చిన రఘుపతి మాలతిని కదలనీయలేదు. "ఇందుకన్న మాట, నీవు క్రిందినుంచి పైకి మార్చుకొన్నావ్ నీ గదిని ?"

అతడి ప్రశ్నలో మార్ధవం, అనురాగం వున్నప్పటికీ అపరాధినిలా తల ఒంచుకుంది మాలతి.

"నన్ను ఆఫీసుకు సాగనంపి, నువ్వీ కిటికీ దగ్గర బైఠాయించుతున్నావన్నమాట ? ఆ యింట్లో ఆమెనూ ఆమె

బిడ్డలనూ చూస్తూ, నీకు లేని యోగాన్ని నిత్యం తలచుకొని కుళ్ళిపోతున్నానన్న మాట ?"

ఎంత ప్రయత్నించినా మాలతి కన్నీరాగలేదు. "ఎలా మరపుకు వస్తుంది నా దుస్థితి నాకు ? ఇది మరచిపోగల దురదృష్టమేనా ?"

"ఇక మనకి లేని సంతానయోగం గురించి ఎంత దురటిల్లితే మాత్రం ప్రయోజన మేమిటి మాలతీ ? నాకు మాత్రం బాధ లేదంటావా ? అక్కడికీ సిగ్గు విడచి ఎందరో డాక్టర్లని చూశాం, ఎన్నో మందులు తిన్నాం. ఆపరేషన్లు కూడా అయ్యాయి. ఇంకేం దారి మిగిలింది చెప్పు ? ... ... దేవతలకంతా మొక్కడం పూర్తిచేసి కన్పించిన రాయి కెల్లాకూడా మొక్కుతున్నాను. ఎలాగో మనసును రాయి చేసుకోవాలి. ఇలా బేలవై పోకూడదు."

అతడి లాలనా హితోక్తుల శీతల వాయువులు శోకి ఆమె యెదలో పేరుకొన్న నల్లని నిరాశా మేఘం కరిగి కన్నీరై ప్రవహించింది.

"మీకేం, మగవారు ! ఎన్నైనా చెప్తారు." రుద్ధ కంఠంతో అన్నది. "కాని నాకు బ్రతుకు రోజు రోజుకూ దుస్సహమై పోతోంది. గుమ్మంలో కెవరొచ్చినా 'పిల్లలెందరమ్మా?' అనే ప్రశ్నే ?"

"చెప్పేసేయి. దేశమందరి పిల్లలూ నా బిడ్డ లేనని!" నిర్లక్ష్యంగా అనేశాడు రఘుపతి బూట్లు విప్పుకొంటూ.

"చాల్లెండి రోజూ ఈ పాఠాలు నా దగ్గర వల్లె వేయద్దు." ఒడలు తెలియని ఆవేశంలో నున్న మాలతి కం

రింది భర్తను. "ఇంత ఘోరమైన వంధ్యత్వం ఆ దైవం నా కెందుకు రాయాలి ? పక్కింటావిడ నన్ను చూస్తూనే తన బిడ్డను చాటు చాటున దాచుకుంటుంది. అంత పాపిష్టిదాన్నా నేను ? మొన్న పేరంటంలో ఒకామె ఎవరినో అన్నట్టు అనేసింది నా పక్కనే కూర్చుని ... 'కొడుకులు లేనిదాని మొహం పొద్దున్నే చూస్తే పంచపాపాలూ' నని. ఈ మాట విని నేను యింకా బ్రతికున్నాను." వెక్కిళ్ళు మాటల కడ్డు వచ్చాయి.

"ఏడిసింది." అసహనం తాండవ మాడింది రఘుపతి గళంలో. "అనక ఆమె కొడుకు లామె నెత్తిన పెడతారులే ఓ బండరాయి, విడ్డూరీగనీ."

"అదికాదండీ." కొంచం శాంతించిన స్వరంతో అభ్యర్థించింది మాలతి. "పోనీ మనం ఎవరి బిడ్డనైనా పెంచుకొంటే ?"

దీనాతిదీనంగా వున్న ఆమె వచోవైఖరికి చూచి తాత్కాలికంగా మాట్లాడ లేకపోయాడు రఘుపతి. "సరే ఆలోచించుదాం." అన్నాడు కడకు.

అవకాశం లభించిన మాలతి ఆ క్షణంనుండే అనుక్షణం అతడిని వేధించసాగింది. "ఆలోచించండీ బాగా. ఎవర్ని పెంచుకుంటే బాగుంటుందీ ? ఆడపిల్లనా, మగబిడ్డనా ?"

విని విని కడకు ఒకనాడు అన్నాడు రఘుపతి: "అయితే బాగా నిశ్చయించుకున్నావా, పెంచుకోవటానికి ?"

"ఓ! మళ్ళీ మొదటి కొస్తున్నారేమిటి మీరు? చక్కటి అందమైన ఓ ఆడపిల్లనీ, మాంచి చలాకీ అయిన ఓ మగపిల్లాడినీ తెచ్చుకుందాం."

"ఆడా - మగా! ఇద్దరా?" అదిరిపడ్డాడు రఘుపతి.

"అవును ఏం? ఇద్దరేం ఖర్మ - పదిమందిని దర్జాగా పెంచగల స్తోమతువున్నది మనకు. దైవం దయతలచలేదు కాని."

"అంతా మన మేలుకే! అంటారులే పెద్దలు. ఏమో దేవుడు పదిమందినే యిచ్చివుంటే నువ్వు కనలేక పెంచలేక అవస్థపడ్తూందువేమో నీరసాలతోనూ జబ్బులతోనూ" బిగ్గరగా నవ్వేస్తూ హాస్యంగా ఎగరగొట్ట జూచాడు విషయాన్ని రఘుపతి.

తానూ చిన్నగా శృతి కలిపింది మాలతి. "అదేం కాదులెండి. చక్కగా ముస్తాబుచేస్తూ, నగలు చేయించి - పెద్ద చదువులు చెప్పించి ... ఎలా గెలాగో పెంచేదాన్ని అస్తారుబతంగా!" నిజంగా తనకి సంతానమే వుండివుంటే ఎలాగుండేదో వూహించుకుంటూ, అరమోడ్పు కన్నులతో ఆ ఊహాలోకంలో తేలిపోతూ మాట్లాడింది మాలతి. అంతలోనే తేరుకొని, "ఆఁ. ఇప్పుడు మాత్రమేమైందిలెండి. మీరే చూస్తారుగా, ఇప్పుడు తెచ్చుకొన్న అబ్బాయినీ, అమ్మాయినీ ఎలా పెంచుతానో!" తిరిగి మొదటి కొచ్చింది సంభాషణ. "ఇంతకూ నే నడిగింది చెప్పారు కారు. మాంచి అందమైన పిల్లల్ని తెచ్చుకోవాలి. ఔనా?"

ఏమన లేనట్లుగా ఇబ్బందిగా కదిలాడు రఘుపతి. "మన ఇష్టప్రకారం దొరకరనుకుంటాను మాలతీ" అన్నాడు అనలేక అనలేక.

"ఏం ఎందుకు దొరకరు?" మాలతి అసహనమంతా స్వరంలోనే ప్రస్ఫుటమైంది.

"అందరూ పిల్లల్ని పెంపకాని కివ్వరు మాలతీ. ఇచ్చే వాళ్ళలో మనకి నచ్చిన వాళ్ళుండకపోవచ్చు. దొరికిన వాళ్ళతో సరిపెట్టుకోవాలి"

నిర్లక్ష్యంగా చూచి, బిగ్గరగా నవ్వింది మాలతి. "మనం అడగాలేకాని, ఇవ్వని వాళ్ళుంటారా, మన సంపద చూచి? మీరే చూస్తారుగా?" సవాలు చేసినట్లే మాట్లాడింది.

ఒక విధమైన ఆవేశ ప్రవృత్తి మాలతిది. అందుకే ఆ స్థితిలో ఆమెతో ఇక వాదన అనవసరమన్నట్లుగా మౌనం వహించాడు రఘుపతి.

## 2

"ఏమిటిది, గాలీ వెలుతురూ రాకుండా కిటికీ తలుపులన్నీ బంధించేశారు?" ఆఫీసునుంచి వస్తూనే ఊపిరాడనట్లై, మాలతి గది కిటికీలు తెరువబోయాడు రఘుపతి.

"వద్దు." శాసించినట్లుగా అరిచింది మాలతి ఏదో మూల నుంచి.

ఉలిక్కిపడ్డ రఘుపతి అంతలోనే సర్దుకున్నాడు. "అరె! నువ్వెక్కడున్నావు ఈ చీకటిలో? ఏమిటిది?" ఆశ్చర్యపోతూ లైటు వేశాడు. వేసి, భార్యను చూస్తూనే కలవరపడ్డాడు.

వర్ణనాతీతమైన ముఖభంగిమలతో విడ్డూరంగా కన్పట్టుతూ ఓ మూల కుర్చీలో కూర్చుని వున్నది మాలతి. ప్రపంచమందలి క్రోధరసమంతా ఆమెచుట్టూ వెల్లువలై పారుతూన్నట్లే అనిపించింది

"ఇకనుంచి ఆ కిటికీ ఎప్పుడూ తెరవటానికి వీల్లేదు. ఆ దరిద్రులు నా కళ్ళకు కన్పించరాదు!" అలవిమాలిన కోపావేశాలతో వూగిపోతోంది మాలతి భద్రకాళిలా.

"ఏమిటి, ఏం జరిగింది?" అని కూడా అడుగ సాహసించలేకపోయాడు రఘుపతి. భార్యయొక్క అంతటి రౌద్ర రూపంలోనూ ఏదో ఓ మూల శోకపరితప్తతా, అవమాన పీడతా ద్యోతకమయ్యాయి అతడికి.

ఆ మర్నాటికిగాని అసలు విషయం అతడికి తెలిసి రాలేదు.

జరిగిన విషయం ఇది :

తమ ఇరుగు పొరుగునవున్న ఆ పూరింటి ఇల్లాలిని కబురంపింది మాలతి నౌఖరుచేత.

"ఏమమ్మా. నన్ను పిలువ నంపారట?" ధనలక్ష్మి వంటి మాలతి తనను పిలువనంపినందుకు, పొంగిపోతూన్న సంతోషంతో వెంటనే వచ్చింది ఆ బీద ఇల్లాలు.

"చూడమ్మా, నీ పేరేమిటన్నావ్? ఏమిటో ఇరుగు పొరుగున వుంటూకూడ ఎప్పుడూ మాట్లాడుకోలేదు".

ఆదరంలోనే ఒక విధమైన దర్పం మిళాయించి సంభాషణకుపక్రమించింది మాలతి.

"సీతమ్మండి నా పేరు." సిగ్గు నభినయిస్తూ చెప్పిందామె. "ఎన్నోసార్లు నేనే వద్దామనుకున్నాను. కానీ … … తమ కిష్టముంటుందో లేదోననీ …" నసిగింది.

"అయ్యయ్యో, ఎంత మాట! రావలసింది మరి! పోనీ, ఇప్పుడైనా కలిశాం." భావయుక్తంగా నవ్వింది. "మీకెంతమంది పిల్లలూ? అప్పుడప్పుడూ చూస్తూంటాను. ముత్యాల్లాగా బాగుంటారు పిల్లలు."

"ఏదో తమ దయ! ముగ్గురాడ పిల్లలూ, ఇద్దరు మగ పిల్లలూనండి."

"ఏమిటో పాపం, వాళ్ళతో చాలా సతమతమై పోతూంటావ్. అప్పుడప్పుడూ చూస్తూనే వుంటాను."

"ఔనండి. ఏమిటో ఎంత పని చేసినా ఇంకా ఏదో ఓ పని తరవాయిగా మిగిలిపోతూనే వుంటుంది. ప్రాణం నిస్త్రాణ పడ్తుంది కాని పని తెమలదు చిన్నాచితకా పిల్లలు—చాకిరీ ఎక్కువ." పిల్లలుగల తల్లిని కదపాలే కాని కథనం చెప్పటానికామె కేమీ శ్రమవుండదు తన సంతానం గురించి.

"నిన్న ఉదయం అనుకుంటా చూశాను. మీరు బాగా విసుక్కుంటున్నారు పిల్లలమీద. ఏం చేశారేమిటి? చిన్న వాడిమీద చెయ్యికూడా చేసుకున్నట్టున్నారు!"

"ఆఁ. ఏం చెప్పమంటారమ్మా?" ఉస్సురంటూ నిట్టూర్చింది సీతమ్మ. "మరీ స్తోమతు తెల్సుకోకుండా పేచీలు పెడతారు. చేతికంది వచ్చిన ఆడపిల్ల పని చేయకపోతే ఎలాగ?

గిన్నెలు తోమివ్వమంటే చదువుకోవాలి, తీరిక లేదు — పని మనిషిని పెట్టుకోమంటూంది. మా బ్రతుక్కి తోడు నెలకు పది రూపాయలతో పనిమనిషి కూడానా చెప్పండి?"

మౌనంగా వింటోంది మాలతి.

"స్కూల్లో ఎవరో డాక్టర్‌గా రబ్బాయి వేసుకున్నట్టు వంటి దుస్తులు కుట్టించమని ఒకటే ఏడుపు రెండో పిల్లాడు. దాంతో ప్రాణం విసిగిపోయి రెండు వేశాను. ఏం చేయను చెప్పండి? ఎంత ఓర్పుగా వున్నా పిల్లలు వుండనీరు? కలవారింట్లో పుడితే ఎన్ని వేషాలైనా వేయొచ్చు!"

అవకాశం జార విడుచుకోలేదు మాలతి. చటుక్కున మాటలో మాట అనేసింది. "కలవారింట పుట్టకపోయినా— అదృష్టం వుంటే కలవారింట పెరగొచ్చు. అన్ని సరదాలూ తీర్చుకోవచ్చు?"

అనుకోని వింతో విశేషమో చూచినట్టుగా అవాక్కై పోయి, అలాగే కనురెప్పలు కూడ కదల్చడం మరచి కూర్చున్న తావునే కూర్చునిపోయింది సీతమ్మ.

"ఔను సీతమ్మగారూ! మాకు ఇంత కలిమి వున్నా అనుభవించే పిల్లలు లేరు. మీరా — పాపం, చాలీచాలని సంపాదనతో పిల్లల ఆలన పాలనలు చూచుకోలేక సతమతమై పోతున్నారు. ఆఖరి పిల్లనీ, పిల్లాడినీ మాకు 'పెంపకం' ఇచ్చేయండి. ఇక్కడ హాయిగా పెరుగుతారు!"

స్థాణువైపోయిన సీతమ్మలో కదలిక వచ్చింది.

"ఇందుకా తల్లీ, పనిగట్టుకు కబురంపావు నన్ను?" జేవురించిన ముఖంతో, నిర్మోహమాటంగా అనేసింది.

"ధనానికి లేనివాళ్ళమైనా మానాభిమానాలకు లేని వాళ్ళం కాదు. పనిమాలా పిలిచి, మా బీదతనాన్ని ఇంతగానా పరిహసించడం? చాలు!" నిప్పులు చెరిగే నేత్రాలతో అనేసి వెనుదిరిగింది.

ఈసారి నిర్ఘాంతపడటం మాలతి వంతైంది.

"అదేమిటి? ఇందులో అంత కోపం రావలసినదేముంది? ఎంతమంది పిల్లల్ని పెంపకాలకిచ్చుకోవడం లేదు?"

"అమ్మా చాలు!" విసిగి వేసారినట్లున్న స్వరంతో రెండు చేతులూ జోడించింది సీతమ్మ

"కలిగినంతలోనే పెంచుకుంటాం కానీ, డబ్బు లేనంత మాత్రాన కడుపున పుట్టిన బిడ్డ చేదౌతుందా — కన్న మమకారం మాసిపోతుందా? పిల్లలేమీ గాలికీ ధూళికీ కొట్టుకొచ్చినవాళ్ళూ, తేరగా దొరికేవాళ్ళూ కాదు — బజార్లో వస్తువుల మాదిరి అడగటానికీ ఇవ్వటానికీను. మాతృత్వపు విలువా బిడ్డ విలువా తెలియనివాళ్ళూ, ఒళ్ళువంచి పెంచలేని వాళ్ళూ ఇవ్వాలి దత్తతలకు. పాయసాలూ, అమృతాలూ లేకున్నా, నా ప్రాణమూ ప్రేమాపోసి పెంచుకుంటున్నాను నా బిడ్డల్ని." విసవిసా వెళ్ళిపోయింది సీతమ్మ, మరో మాటకోసం ఆగకుండా.

"ఎంత పొగరు!" తల పంకించింది మాలతి. "తిండికి లేకపోయినా తిక్క మాత్రం తక్కువ లేదు. వెధవ పిల్లలు, జోడిపిల్లలు! ఎలాగైతే కన్నది! వీళ్ళ బాబుల్లాంటి వాళ్ళని తెస్తాను!" అని శపథం పట్టింది.

విషయమంతా ఆమూలాగ్రంగా విన్న రఘుపతి సిగ్గుతో కుంచించుకుపోయాడు. అనిర్వచనీయమైన బాధ ననుభవించాడు అంతరాంతరాలలో.

"అలా తొందరపడి అడిగేసేయ కూడదు మాలతీ. వాళ్ళ స్వభావమేమిటో జాగ్రత్తగా పరిశీలించి, అనుకూలంగా వుండేటట్టు తోస్తే ఎవరిచేతనైనా అడిగించాలి..."

అతడిమాట పూర్తి కాకుండానే ఛరుర్రుమన్నది మాలతి. "ఏడిసింది. మళ్ళీ ఓ మధ్యవర్తి, రాయబారమూనా? ఏం చూసుకొని ఆ గర్వం? దాని మొగుణ్ని పిలిచి అడగండి మీరు. ఎన్నివేలు కావాలో అడగండి. చక్కగా అంగీకరిస్తాడు."

ఒక విధమైన ఆవేశానికి లోనై కేవలం మూర్ఖంగా మాట్లాడడం మినహా ఏమీ ఆలోచనా, వివేకమూ లేని ఆ ధోరణికి భయపడ్డాడు రఘుపతి.

"పోనిద్దూ. అసలెందుకు మనకీ గోలంతా?" తేలికగా తుంచివేయటానికి ప్రయత్నించాడు. "పిల్లలంటే ఎంత చాకిరీ ఎంత అవస్థ? అవన్నీ నువ్వు భరించగలవా?"

ఆతడి మాటలు వింటూనే మాలతి వివశురాలైంది. "చాల్లెండి. అందరూ అవమానించేది కాకుండా మీరు కూడానా? నేను పిల్లల్ని పెంచలేనా?"

"కోపం వద్దు మాలతీ, ఊరికే మాటవరుసకన్నాను. అంతే"

"ఏమైనా సరే. నేను పిల్లల్ని పెంచుకోనే తీరాలి!" ఖరారుగా తన నిశ్చయం తెలియజేసింది మాలతి.

# 3

"రెండు నెలల సెలవు దేనికి మాలతీ?" అర్థం కాక ప్రశ్నించాడు రఘుపతి అయోమయంగా.

"మన వాళ్ళందరిళ్ళకీ వెళ్ళివద్దాం. మీరుకూడావస్తే కాని నే నొక్కతెనీ వెళ్ళను. నా మాట కాదనకుండా అప్లై చేయండి ఆఫీసులో సెలవుకు."

"ఏం, ఎందుకని మన వాళ్ళందర్నీ చూడాలని బుద్ధి పుట్టింది?" మందహాసంతో అడిగాడు రఘుపతి. "అబ్బె. శక్తి కుతూహలం మాత్రమే. నీ కభ్యంతరం లేకుంటే చెప్పొచ్చు."

తానూ నవ్వింది మాలతి. కాని ఆ నవ్వులో ఏదో విలితి, మందస్వరాన అన్నది : "ఏముందీ! మనవాళ్ళందర్నీ చూచినట్లూ వుంటుంది. తీరు తెన్నులు మనకు నచ్చిన చోట పిల్లల్ని తెచ్చుకుందాం పెంపకానికి."

అప్రతిభుడై పోయాడు రఘుపతి. మనసులోని దావా నలాన్నంతనూ అణచుకుంటూ, అతి మామూలుగా "సరే" అని అంగీకారం తెలుపక తప్పలేదు.

కోడలి నిర్ణయం విని రఘుపతి తల్లి కాంతమ్మ ఆమోదం వెలిబుచ్చింది. "ఏమిటో! ఎంత కలిమి ఉన్నా వంశోద్ధారకులుంటేనే అందం. పెళ్ళై ఏడేళ్లాయె! ఇంకేం

పిల్లలు పుడతారు ? ఇక దత్తత చేసుకోవటమే మంచిది. అయితే ఎవరి పిల్లాడిని దత్తత తెచ్చుకోవాలనీ ?"

"ఏదమ్మా, ఇంకా ఏం నిర్ణయించుకోందే ?" రఘుపతి కల్పించుకొని సమాధానం చెప్పాడు. "మనకు నచ్చాలి. అవతలివాళ్ళు ఒప్పుకోవాలి కదా ?"

"ఆఁ. అదో పెద్ద సమస్యా ఏమిటి ?" తేలికగా తీసి పారేసింది కాంతమ్మ. "నేననేదేమంటే ... ..."

"ఏమిటీ?" భార్యాభర్తలిరువురూ ఒకేసారి ప్రశ్నించారు ఉత్సుకతతో.

"కాస్త మనలో మనబిడ్డే అయితే ..." తటాపటాయిస్తూ చెప్పింది కాంతమ్మ. "వంశం, గోత్రం, యింటిపేరూ, అన్నీ కలిసొస్తాయి. పైవాడూ అనే భావమూ వుండదు. ఏమంటారు ?"

అర్థం కానట్లు చూచింది మాలతి.

రఘుపతి సర్ది చెప్పేశాడు. "అలాగైతే మరీ మంచిదమ్మా, మాలతి కటువంటి నీ—నా అన్న భేదభావమే లేదు పాపం. అయితే — తను ఓ మగపిల్లాడినీ, ఆడపిల్లనూ ఇద్దర్నీ పెంచుకొందామన్న ఉద్దేశ్యంలో వుంది."

"అయితే మరీ మంచిది !" పని అంతా జరిగిపోయినట్టే చిటికె వేసింది కాంతమ్మ.

"మన ప్రసాదం కొడుకుని పెంచుకోండి!"

రఘుపతి తమ్ముడే ప్రసాదరావు.

"మన ప్రసాదమే ? ఒప్పుకుంటాడా ?" రఘుపతి సందేహం వెలిబుచ్చాడు.

"ఏం. ఎందుకొప్పుకోడూ ? వాడికి స్వంత అన్నవి ! వాడి బిడ్డ ఒకటీ, నీ బిడ్డ ఒకటీనా? అయినా, నేను నచ్చ జెప్తానుగా వాడికి ఒకవేళ కాదంటే ? వాడిని పెంచుకొని, మాలతి తమ్ముడి కూతుర్నికూడా చేరదీసి — తనకి ఆడ పిల్లనికూడా పెంచాలనుంది గనుక... ఇద్దరికీ పెళ్ళి చేసేస్తే సరి !"

రఘుపతీ మాలతు లిరువురికీ కూడా చాలా సమంజ సంగా, చక్కగా తోచిందా ప్రతిపాదన. అప్పుడే తాను పెంచబోయే పిల్లలకి ఎటువంటి దుస్తులు వేయాలో, ఏం నగలు చేయించాలో, ఏం చదువులు చెప్పించాలో ఊహా గానాలుచేసి ఉప్పొంగ సాగింది మాలతి మనస్సు.

## 4

ఎన్నాడావో స్నానం చేసినట్టూ, ఎన్ని నెలలావో తల దువ్వుకున్నట్టూ, మరెన్ని మాసాల క్రితమో దుస్తులు మార్చినట్టూ వున్న అవతారంతో దర్శన మిచ్చింది ప్రసాద రావు భార్య అత్తా తోటి కోడళ్ళకు.

"రండి రండి అత్తయ్యగారూ, రావమ్మా అక్కా. ఏమిటి దయ ఇలా ప్రసరించింది ? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు మా యింటిని పావనం చేశారు !" అంటూ నిండుగా నవ్వుతూ మనస్ఫూర్తిగా ఆహ్వానించింది.

"ఎప్పుడూ నిన్నూ పిల్లల్ని తలుచుకుంటూనే వుంటాను సరోజనీ. కాకుంటే రావాలంటే మాటలు కాదు కదా ! బావ గారికి సెలవు దొరకడం గొడవా—నీకు తెలియనిదేముంది?" అంటూ మాలతి తోటి కోడలికి సమాధానం చెప్పుకొంది. "ఏమిటలాగున్నావ్ ? ఇంకా స్నానం అదీ ఏం చేసినట్లు లేదే !"

వింటూనే అతి తేలికగా నవ్వేసింది సరోజిని. "పిల్లా జల్లా వున్నవాళ్ళం — నీలా తెల్లారే సరికే నీటుగా ఎలా తయారవ్వగలం చెప్పు ? నా కంటే ముందు వాళ్ళే లేస్తారు. ఇక ఏదో ఒకటి — ఏదో ఒకటి. ముగ్గురినీ సరిదిద్దేటప్పటికి నా ప్రాణాలు పోతున్నాయనుకో !"

చివుక్కుమన్నది మాలతికి, 'పిల్లలు లేని దానవు — నీకేం తెలుసు పిల్లల తల్లి అవస్థ ?' అన్నట్టున్న ఆ సమాధానానికి. 'ఆఁ. అన్ని అర్థాలతో తను అని వుండదులే. ప్రతి దానికీ భుజాలు తడుము కోవటమనేది చాలా తప్పు' అని తనకు తానే సర్ది చెప్పుకున్నది తిరిగి.

ఆ పగలంతా క్షణం తీరిక లేని కుశల ప్రశ్నలతో, బంధుమిత్రుల భోగట్టాలతో గడచి పోయింది సాయంకాలం పెరట్లో కూర్చున్నారు అత్తా కోడళ్ళు ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ. అంతలో ప్రసాదరావు హడావుడిగా లోపలికి వచ్చాడు భార్యను పిలుస్తూ.

"చూడు సరోజని. మా ఆఫీసు వాళ్ళెవరెవరో వచ్చారు. త్వరగా ఓ ఆరు కప్పుల కాఫీ తయారు చేసుకురా."

"అలాగే." అంటూ సరోజని లేచింది. "అమ్మా నన్నెత్తుకో" అంతవఱకూ అక్కడే ఆటలాడుకుంటూన్న మూడేళ్ళ కూతురు వెనకబడి కొంగు పుచ్చుకు వేళ్లాడ సాగింది.

"అబ్బబ్బ. నీ ఆటలేవో నువ్వాడుకో రాదూ? కాస్త కదిలేసరికి కలగన్నట్టు వస్తావేం?" విసుగ్గా విదిలించుకో బోయింది సరోజని. కానీ ఆ పిల్లవదలి పెట్టలేదు తల్లిని. ప్రాకుతూ ఇల్లంతా చక్కబెట్టడం అప్పుడప్పుడే నేర్చిన పసి పిల్లవాడు తపతపా వచ్చేశాడు తల్లి దగ్గఱకు, ఆమె పెద్ద పిల్లను ఎక్కడ ఎత్తుకుంటుందో నన్న అసూయతో. ఇక తాను మాత్రం మిగలడమెందు కన్నట్లుగా ఆ ఇద్దరి మధ్య వాడూ—అంతవఱకూ ఎక్కడెక్కడ ఆడి వచ్చాడో వంటి నిండా మట్టి పులుముకుని, ఆ మట్టి చేతులతోనే తల్లిని పట్టుకుని అకారణంగా ఏడవ సాగాడు.

"ఏం సరోజనీ, కాఫీ అయ్యిందా?" బయటినుంచి ప్రసాదరావు కేక వినవచ్చింది.

ఏమిటేమిటో — భాష కందని విధంగా — రంగులు మారిపోయాయి సరోజని వదనంలో. కళ్ళు నీళ్ళ పర్యంతమైంది ఆమెకు.

"ఛీ. ఛీ. దరిద్రపు గోల. నన్నొక క్షణం వదల కేడుస్తా రేంరా, ముగ్గురికీ ముగ్గురే, నన్నే యముడైనా ఎత్తుకుపోతాడా యిప్పుడే?" పెద్దవాడు చీర కంటించిన మట్టిని దులుపుకుంటూ,

పసివాడు పారాడుతూ లాగేసిన కుచ్చెళ్ళను దోపుకుంటూ చికాకు పడసాగింది సరోజని.

"ఏం సరోజనీ ఇంకా అవ్వలేదూ ? అవతల, వాళ్ళు వెళ్ళిపోతామని తొందర పడ్తున్నారు" ఏదో మునిగిపోతున్నట్లుగా మళ్ళీ ఆదరాబాదరా లోపలి కొచ్చాడు ప్రసాదరావు.

తన అసహాయ క్రోధమంతా పెద్ద పిల్లపై చూపెట్టింది సరోజని. "ఒక్కగోలకాదు నా ప్రాణానికి, ఛీ యమకింకరుల్లా దాపరించారు." అంటూ ఫెడఫెడ రెండు బాదింది వీపు మీద.

"ముయ్యి, నోర్ముయి, మూస్తావా లేదా ?" ప్రసాద రావు తన కోపంకూడా ఆ పిల్లమీదే కురిపించాడు చేతి సత్తువ కొలదీ బాదుతూ. "ఛీ ! దరిద్రపు కొంప. స్నేహితు లకు కాస్త కాఫీ ఇచ్చే గతికూడా లేదు." తిట్టుకుంటూ నిష్క్రమించాడు.

"అయ్యయ్యో. మధ్యన పిల్లని బాదుకుంటా రేమట్రా ?" కాంతమ్మ ఓ వైపున, మాలతి ఓ వైపునా పరుగు పరుగున వచ్చారు, పిల్లల్ని తీయటానికి. ఆరునొక్క రాగం ఆలాపిస్తూ అలాగే తల్లినే పీడించసాగారు కాని, ఆమె కొట్టినా విసుక్కున్నా ముగ్గురిలో ఒక్కరూ కూడా కొత్త వ్యక్తులైన మాలతీ కాంతమ్మల దగ్గఱకు చేరలేదు.

"ఇవాళ కొత్తేంకాదు. రోజూ ఇంతేనక్కా నా బ్రతుకు." కళ్ళనిండా నీళ్ళు నింపుకుని తన బాధను తోటి

కోడలికి వెళ్ళబోసుకుంది సరోజని. "ముగ్గురూ కాళ్ళ వేళ్ళా పడే ఊహ తెలియని పిల్లలే. ఎంత చాకిరీయో చూస్తున్నావు కదా! ఇంటెడు చాకిరీ, పిల్లల పనీ — ప్రాణం పోయినట్టుగా ఉంటుంది నాకొక్కోసారి అలసటతో. ఇంకా ఈ పని చాలదన్నట్టు ఆయన అందర్నీ కాఫీలకీ, భోజనాలకీ తీసుకురావడం— నన్ను దుమ్మెత్తి పోయడం."

ఎంతైనా జాలివేసింది మాలతికి. "నిజమే సరోజనీ. కాస్త ఆడవాళ్ళ కష్టం సుఖం తెల్సుకోకపోతే యిబ్బందే మరి! ఏమిటో ఈ మగాళ్ళు!" సానుభూతి ఒలకబోసింది.

"ఆఁ చాల్లే!" అధికార పూర్వకంగా ఈసడించింది కాంతమ్మ కోడలిని. "అవ్వ! నలుగురి మగాళ్ళకి కాస్త కాఫీయే కాచి పోయలేని సుకుమారమా!" బుగ్గలు నొక్కుకుంది విడ్డూరమేదో విపరీతంగా జరిగిపోతున్నట్టు "మగాడు విసుక్కున్నాడంటే విసుక్కోడూ మరీ! ఇంటికొచ్చినాళ్ళకి నాలుగు కాఫీ చుక్కలకే గతిలేదంటే అదెంత తలవంపు నలుగురిలో తిరగాల్సిన మగాళ్ళకి! అయ్యో రాత! మా నాడు మేమిలాగే చేశామా? పదేసిమంది పిల్లల్ని అవలీలగా కనిపెంచాం. వందమంది ఒక్కసారి వచ్చినా చిటికెలో వార్చి వడ్డించేసేవాళ్ళం. మరీ షోకులెక్కువై — నాజూకులు బలిసిపోయి — ఇలా అడుగడుగునా ఉసూరుమంటూ ముఖాలు పెడ్తున్నారు సిగ్గులేక!"

తిరుగులేని — ఆపులేని అత్తగారి వాగ్ధాటికి, తోటి కోడళ్ళిద్దరూ కిమ్మనకుండా నోళ్ళు నొక్కుకున్నారు.

"ఇప్పటికైనా తయారైందా ?" ప్రసాదరావు మళ్లా వచ్చాడు లోపలికి.

"ఆఁ ఆఁ." ఆదరా బాదరా తయారుచేసిన కాఫీని కప్పుల్లోపోసి అందించింది సరోజని.

"ఏమిటిలా నీళ్ళల్లా తగలడింది ?" సణుక్కుంటూ తీసుకుపోయాడు.

"ఏదోలా చేశాను. చేయగలిగినందుకు సంతోషించండి. వంకలుకూడా దేనికీ ?" సరోజనిది కూడా అంతగా మిన్నకుండే స్వభావం కాదు.

"ఆఁ ఉద్ధరించావ్ ! మహా నువ్వే వెలిగించేస్తున్నావ్ పిల్లజల్లాతో సంసారం ! ఇంకెవళ్ళూ చేయటంలేదు మరి లోకంలో !" పోయేవాడు ఆగి, భార్య విసురుకు తగ్గ మరో విసురు విసిరి మరీ పోయాడు.

అంతా తిలకించుతూన్న మాలతికి ఏమిటోగా అయిపోయింది మనస్సు. మాతృత్వం స్త్రీకి మహత్తరమైన విలువను కలిగించుతుందనేది కథలలో-కావ్యాలలో కల్పించబడిన కేవలం ఊహాప్రక్రియే కాని యదార్థం అందుకు భిన్నం. తనకు సుఖాన్నందించి, తన ప్రతిబింబాన్ని మోసి, స్వీయ రక్త మాంస ప్రాణాలు పోసి కని పెంచినందుకు అటు భర్త నుండి గానీ, ఇటు తనవంటి స్త్రీయే అయి — అన్ని సాధక బాధకాలూ అనుభవించినదైన అత్తనుండిగానీ ఆమెకు పీస మెత్తు ఆదరణ లభింపకపోగా అవహేళనావమానాలే నెత్తిన రుద్దపడుతున్నాయి.

తిరిగి రాత్రి భోజనాల దగ్గఱ మరో రగడ ! అందరూ భోజనాలకు కూర్చున్న సమయంలో అదను దొరికినట్టుగా పెద్ద పిల్లవాడు పళ్ళుకోసే చాకుతో చెయ్యి తెగ్గోసు కున్నాడు.

“ఛీ ఛీ. ఇంత అజాగ్రత్తగానా పిల్లలున్న యింట్లో సరుకులు వదిలేయటం ?” రక్తం కారుతూన్నచోట వేలు నొక్కి పట్టుకుంటూ భార్యను మందలించాడు ప్రసాదరావు.

“కనగానే సరా, పెంపకం రానివాళ్ళు ?” అవకాశం దొరికిందన్నట్లుగా లంకించుకుంది కాంతమ్మ. “కనేసి, వాళ్ళని అలా గాలికీ ధూళికీ వదిలేయడం సిగ్గూ, శరం లేక. చూస్తు ఒక్కొక్కళ్ళే ఈనె పుల్లల్లా ఎలా వున్నారో ? ఒళ్ళు వంచి కాస్త వేళకు నీళ్లూ పాలూ చూస్తేగాని పిల్లలు ఎదుగు తారా ?”

‘భర్తే అప్రయోజకుడూ అవివేకీ అయి అందరిఎదుటా భార్యను నిందిస్తే, ఇక అధికారమే పరమావధిగా పెట్టుకున్న అత్తనోరు లేవకేం చేస్తుంది ?’ అన్నట్టున్నాయి మౌనంగా దీనంగా చూస్తున్న సరోజని చూపులు.

“ఎందుకురా అబ్బాయి ఇంత అవస్థ?” తీరికగా కాళ్లు బారజాపుకుని, అదనుకు తగ్గట్టుగా తాను చెప్పదలచుకున్నది చెప్పేసింది. “ఓపిక లేదు మొర్రో అంటూ ఈవిడగారేం పెంచుతుందింక పిల్లలిని ? ఒకళ్ళనో ఇద్దరినో రఘు కియ్యి. పుణ్యాం, పురుషార్థం అన్నీ దక్కుతాయి. పిల్లలకోసం మాలతి కూడా ముచ్చట పడుతోంది ! లక్షణంగా పెంచుతుంది ! ఆస్తీ పైకిపోదు… …”

ఉలికిపడ్డట్టుగా కొడుకులూ కోడళ్ళూ బిత్తరపోయి ఒకరి మొగా లొకరు తలెత్తి చూచుకోనుకూడా చూచుకో లేకపోయారు.

'అయితే ఈవిడ తాపత్రయం ఆస్తిపైకి పోతుం దేమోననే బెంగతో నన్నమాట! నా మీద ప్రేమతో కాదు!' తనలోతాను, అర్థమైనట్టుగా తలపంకించుకొంది మాలతి.

మళ్ళీ అందుకొంది కాంతమ్మ. "ఆలోచించరా ప్రసాదం! పిల్లలు నీ దగ్గరుంటే ఎంతో నీ అన్నా వదినల దగ్గరున్నా అంతే. పై వాళ్ళేం కాదు కదా? ఏమిటో — ఈవిడకి పిల్లలున్నా పెంచుకోను ఓపికలేదు! ఆవిడకి ఓపికా సరదావున్నా గొడ్రాలితనం! చేసుకున్న వారికి చేసుకున్నంతా మహాదేవా!" తూటీరాలవంటి మాటలు విసే వారి ఖర్మకు వదలేసి తాను శయ్యజేరింది.

'గొడ్రాలి తనం? గొడ్రాలితనం!' తల కొట్టేసినట్లైంది మాలతికి. 'ఆమెకైతే అంతా కొడుకులూ ... కోడళ్లూ కావచ్చు. కాని నాకు మఱదీ... తోటికోడలూ, ముఖ్యంగా చెట్టంతవున్న మఱది దగ్గఱ ఇటువంటి మాట ... ఎంత సిగ్గు! ఛీ ఈమెకూడా ఒక ఆడదేనా? ఇటువంటి ఆమెను నమ్ముకొని మధ్యవర్తిగా తీసుకురావడం ఎంత పొరపాటు!'

అంతలో సరోజని కంఠం ఖంగుమన్నది. "పిల్లలు పుట్టడంవల్లనే ఓపిక నశిస్తుందని పిల్లల్ని కనిపెంచి నామెకు నేను చెప్పఖ్ఖర్లేదుగా? ఓపిక లేనంతమాత్రాన పిల్లల్ని ఎవ

ళ్ళకీ పంచిపెట్టుకోదు ఏ తల్లీ. నా బిడ్డల్ని పెంపకాల కివ్వా ల్సిన ఖర్మేం పట్టలేదు నాకు."

"అయ్యో! పౌరుషానికేం తక్కువలేదు!" మూలనుంచి మళ్ళీ ముసలి కాంతమ్మ అందుకుంది.

"నువ్వూరుకోవమ్మా" రఘుపతి కలుగజేసుకున్నాడు. "ఎందుకలా బాధాకరంగా మాట్లాడుతావ్ ?" తల్లిని మందలించాడు.

"నాకెందుకు ? ఎలాగో పడండి మీరూ మీరూ !" అటుతిరిగి పడుకుంది ముసలమ్మ.

"విసుగ్గావుండి ఓ మాట అనీ, ఓ దెబ్బ వేసినంత మాత్రానికే తల్లికి పిల్లలు బరువైపోయారనుకో నక్కర్లేదు చుట్టం చూపుగా వచ్చి, మా తల్లీ బిడ్డలను విడదీయడానికి ప్రయత్నించకు అక్కా. నీమీద నాకు జాలైతే వున్నది కాని, అందుకోసం నేను త్యాగం చేయలేను." భోజనం చేయకుండానే చేయి కడుక్కు లేచిపోయింది సరోజని. "నేను ఛస్తే యేమో కానీ, నేను బ్రతికుండగా మాత్రం నా బిడ్డలు నా దగ్గరే వుంటారు !" అన్నది తన గదిలోకి పోతూ పోతూ.

అంతవరకు మౌనంగావున్న రఘుపతి కలుగజేసుకున్నాడు. "కోపం వద్దమ్మా సరోజినీ. నీ కిష్టమైతేనే కాని, బలవంత మేముంది ఇందులో ? బాధపడకు."

ప్రప్రథమంగా సీతమ్మ ధిక్కారంవల్ల కలిగినంత ఆగ్రహం, నిరసనా కలుగలేదు ఈసారి మాలతికి. ఎంతటి కష్టమైనా ఓర్చి బిడ్డలను సాకగల ఈ మాతృప్రేమయొక్క

మహాత్యం ఆమెకు ఆశ్చర్యం కలిగించి ఆలోచింపజేసింది. పిల్లల పెంపకం గురించి అతి తేలికగా ఆమె ఊహించినదానినీ యదార్థంలో జరుగుతూన్న ఈ సంఘర్షణనూ పోల్చిచూస్తే మాలతి తల తిరిగిపోయింది.

అన్నిటికీ ధుమధుమలాడే ప్రసాదరావు ఈ విషయంలో మాత్రం భార్యకు ఎదురు చెప్పకుండా తటస్థంగా ఉండిపోవడం కూడా ఆమెకు ఆశ్చర్యమనిపించింది.

మర్నాడు ఉదయం సరోజని వంటింటిపనుల్లో మునిగి పోయిఉంది. కాంతమ్మ తులసిపూజ చేసుకుంటోంది దొడ్లో. మాలతి అన్యమనస్కంగా అక్కడే కొంచం దూరంలో గచ్చు అరుగుమీద కూర్చుంది.

"ఒసెయ్ ఒసెయ్ ఈ జాబిగాడిని కాస్త ఇక్కణ్ణుంచి తీయవమ్మా మాలతీ ! నన్ను ముట్టుకునేట్టున్నాడు !" ఉపద్రవంగా అరిచింది కాంతమ్మ ఉన్నట్టుండి

పరధ్యానంగావున్న మాలతి విన్పించుకోలేదు.

"అయ్యో అయ్యో ! నా మడికాస్తా మంటబెట్టేటు న్నాడే వీడు ! కదలవేం మాలతీ ? ఏంచూస్తున్నావే కాస్త వీడినలా తీసి ఎత్తుకో ?" కొంచం కోపంగా ఆదేశించింది.

మాలతి అయిష్టంగా లేచి అటూ యిటూ దిక్కులు చూచింది, "వాడు దొడ్లోకి వెళ్ళివచ్చాడు. ఒళ్ళూ, కాళ్లూ, కడగందే ఎలాగ ఎత్తుకోనేది?" అంటూ "సరోజనీ ఒకసారిలా రా." అంటూ పిలిచింది. వంటింట్లో తలమునకలయ్యే పనిలో ఉన్న సరోజని ఊడిపడడానికి పావుగంట పట్టింది. ఈలోగా

పిల్లవాడు కాంతమ్మను తాకడం, ఆవిడ తిట్టుకుంటూ మళ్ళీ స్నానంచేసి రావడానికి పోవడమూ జరిగిపోయింది.

"వెధవ పీనుగ! మడిగా పూజ చేసుకొంటూంటే వచ్చి ..." ఇంకా స్నానాల గదిలోనుంచి కూడా కాంతమ్మ తిట్లు విన్పిస్తూనే ఉన్నాయి

"ఎందుకూ పసి వెధవని అంతంత తిట్లు తిట్టడం?" రంయ్యిన అందుకొంది సరోజని. రాత్రినుంచీ ఎంతో బాధతో సతమతమాతూన్న ఆమె 'అత్త' అనీ 'తోటికోడ'లని గౌరవం ఇక నిలుపదలచుకోలేదు. "పసివాడూ పరమాత్మా ఒకటన్నారు పెద్దలు. అంతమాత్రం తెలియని ఏళ్లు ఎందుకూ ఏటిపల్లానికా? అభం శుభం తెలియని వాడిని పెద్ద నోటితో అలా శపించుతూ పూజచేస్తే మాత్రం ఫలిత మేమిటీ?"

"చాల్లే, నీయింటి కొచ్చానని అనబోకు. ఇది నా కొడుకిల్లు. ఏమనుకున్నావో! ఏం, కాస్త నా పూజ అయ్యే వఱకూ ఆ పసివెధవల్ని అదుపులో ఉంచలేవూ" స్నానాల గదిలోనుంచే అత్తగారు అరచింది.

"ఆఁ మరే," నిరసించింది సరోజని. "ప్రొద్దున్నే మడీ దడీ అంటూ ముక్కు మూసుకు మూల కూర్చోవడానికి సంసారాలు చేసే వాళ్ళకెలా సాగుతుందీ? అన్నీ తీరిన ముసలాళ్ళమా ఏమిటి మేము?"

పరిస్థితి ముదురు పాకంలో పడుతోందని గ్రహించిన మాలతి ఆదుర్దాగా కలుగజేసుకొంది. "పోనీలే ఊరుకో సరోజనీ. ఏదో పెద్దావిడ!"

"ఆఁ పెద్దావిడ! ఆవిడా పెద్దావిడే, నువ్వూ పెద్దావిడవే! బుద్ధులు మాత్రమే చిన్నవి కాని!" సరోజని వాగ్ధాటి తోటికోడలిపై ప్రసరించింది. "నాకు తెలీక అడుగుతాను, ఏం కాస్త ఆ పసివాడు ఒళ్ళు శుభ్రంచేస్తే అరిగి పోతావుటమ్మా అక్కయ్యా? ఎంతో పెద్ద ప్రేమ ఉన్నట్టు పెంచుకుంటానని తయారౌతున్నావ్ మరి?" నిలదీసినట్టే అడిగింది.

మొదట నిరుత్తర అయిన మాలతి కొంత సేపటికి సర్దుకుంది. "నాకు అసహ్యం సరోజనీ పిల్లల మలమూత్రాలవీ ముట్టుకోవటానికి. నేనెప్పుడూ చెయ్యలేదు. అంతే. ఇంకేమీ కాదు." నసుగుతూ సంజాయిషీ చెప్పుకొంది.

"అలాగా!" విస్తుపోయినట్లు చేతులూ, కనులూ తిప్పుతూ తల ఎగరేసింది సరోజని. "మరి పిల్లవాడిని పెంచుకొంటే ఏం చేస్తావ్? అప్పుడు నువ్వే కదా వాడికి తల్లివౌతావ్?"

ఈ ఎదురు సవాళ్లకు కోపం వచ్చినా నిగ్రహించుకుంది మాలతి. "అప్పుడూ నేను చేయక్కర్లేదులే. దాసీ ఉంటుంది; ఆయా ఉంటుంది!" అన్నది బింకంగా.

నవ్వింది సరోజని. "నువ్వు మహాధనవంతుల ఆడపడచువైతే అయ్యావు కానీ, పిల్లల విషయంలో అంతడంబంగా బ్రతకడం అసంభవమని నీకు తెలియదులే మరి! చీర నలగకుండా, ఒళ్లువంచకుండా, చెయ్యికదలకుండా, మలమూత్రాలు పులుముకోకుండా మహారాజులు కూడా పెంచలేరు పిల్లల్ని. ఇహ మనబోటి వాళ్ళం లెక్కా? పరాయి బిడ్డ గనుక అలా దూరంగా కూర్చోగలిగవ్. కన్నతల్లిని నాకు తప్పుతుందా?"

వివిధ భంగిమలలో అంగాంగమూ కదల్చి నాట్యం చేసి నట్టుగా చేసి, తాను అనదలచుకున్న నాలుగు మాటలూ అనేసి పిల్లవాడిని తీసుకుని లోపలికి పోయింది.

అక్కడే వరండా మీదవున్న అన్నదమ్ము లిద్దరూ ఏమీ కల్పించుకోలేదు అదేదో ఆడవాళ్ళ గొడవన్నట్లుగా.

అవమాన భారంతో కుంగిపోయిన మాలతి పన్నెత్తి పలుకలేకపోయింది.

## 5

"నాకు పిల్లలూ వద్దు; పిల్లలుగల వాళ్ళ జంఝాటమూ వద్దు. చాలు ఈ అవమానాలు అడ్డమైన వాళ్ళ దగ్గరా," అని మాలతి అప్పట్లో అనుకొన్నప్పటికీ ఆ నిర్ణయము ఎన్నో రోజులు నిలువ కపోయింది.

'వాళ్ళంతా పరాయివాళ్ళు గనుక అలా నిరసించ గలిగారు. నా స్వంత చెల్లెలు నా ముద్దు తప్పక తీరుస్తుంది!' అని ఆశపడింది, ఓ శుభవేళ బిడ్డ పాపతో భర్త అత్త గార్ల సమేతురాలై వచ్చిన చెల్లెల్ని చూచి. "నందిగామలో మా పిన్నత్తగారికొడుకు పెళ్లైంది. సరే ఇంతదూరం వచ్చాక, నిన్ను చూడకుండా ఎలా వెళ్ళం ? రెండ్రోజులుందాం నీ దగ్గర - అని వచ్చాం." వస్తూనే చెల్లెలు సుగుణ అన్నది.

"అంతేనా ?" నిరుత్సాహంగా అన్నది మాలతి. "రెండ్రోజులు రెండు నిముషాల్లా గడచిపోతాయి. నిజానికి

మీరంతా రెండేళ్ళున్నా నాకు తనివి తీరదు సుగుణా. మఱిది గారూ, అత్తగారూ కూడా రావడం నాకెంతైనా సంతోషంగా ఉంది."

"చాలా ఘోరం!" నవ్వు దాచుకుంటూ సీరియస్‌గా అన్నాడు మాలతితో మఱిది మోహనరావు. "మీదగ్గఱ రెండేళ్ళుంటే అవతల మా ఇల్లూ, వాకిలీ - ఉద్యోగాల మాటేమిటంటారు మరీ?"

"అయితే మీరు వెళ్దురుగాని, మా చెల్లెలుంటుంది."

"ఎంత న్యాయం? ఈ రెండేళ్ళూ నేను జపంచేయాల్సిందేనా? చుట్టం చూపుగా వచ్చినందుకిదా మర్యాద?"

అందరూ పకపకా నవ్వేశారు.

"మా చెల్లెల్ని పెళ్ళాడక ముందేం చేశారో మఱిది గారు. మహా చెప్పున్నారు!" మరో చెణుకు విసిరింది మాలతి.

"అవునే అమ్మాయీ!" సుగుణ అత్తగారు సూరమ్మ అతిప్రేమగా మాలతి చేతులు నిమురుతూ ప్రారంభించింది. "నీకున్న బంధుప్రేమా, ఆపేక్షా మాకు తెలియనిదా? రావాలనే ఉంటుంది కాని ఎంత బాదరబందీ చూడు మాకు! పిల్లాజెల్లా అంటూ పెద్ద తాపత్రయం లేదు గనుక అప్పుడప్పుడు అటు వేపులకు వచ్చి పోతూంటే బాగుంటుంది నువ్వు."

బంధు దర్శనంతో వికసించిన మాలతి వదనం తిరిగి ముల్లు గ్రుచ్చుకోవడంతో ముకుళించుకుపోయింది.

ఆమె పరిస్థితిని గ్రహించిన సుగుణ మాట మార్చింది. "బావగారింకా ఆఫీసునుంచి రాలేదాక్కా?"

"ఇంకా లేదమ్మా." తప్పని సరిగా జవాబిచ్చింది మాలతి తడారిపోయిన గొంతుతో. "స్నానాలకి లేవండి. భోజనాలకి ఆలస్యమైపోతూంది." అంటూ ఆ ఏర్పాట్ల మిషతో ఆ విషమ దృశ్యంనుంచి తప్పుకుంది తాత్కాలికంగా.

"ముసలాళ్ళు కదక్కా ..." చాటున సర్దిచెప్పబోయింది సుగుణ.

"నాకు తెల్సులేవే, నువ్వు బాధపడ్డందేనికీ మధ్యన? ఆవిడ్డైనా వున్నమాటేగా అన్నది? గొడ్డాలినిచూస్తే అంత లోకువా — అసహ్యమూ కాబోలు లోకులకు!" విరక్తిగా అన్నది మాలతి.

సూరమ్మా కాంతమ్మా ఒక్కచోట జేరి సంభాషణ కుపక్రమించారంటే ఒళ్ళంతా జెఱ్ఱులు ప్రాకుతూన్నట్టై ఆ పరిసరాలనుంచి ప్రయత్నపూర్వకంగా పారిపోయేది మాలతి.

"లోకంలో గొడ్డుమోత్తనంతో బాధపడేవాళ్ళని చూశాంగాని, పెంచుకుందామన్నా పిల్ల దొరక్క అల్లల్లాడే వాళ్ళని ఇక్కడే చూశాను. బొత్తిగా ఇదేం జాతకమో మరి! ఇంతకూ ప్రారబ్ధం..."

కాంతమ్మ తన కోడలి నుద్దేశించి తీరికగా సెలవిస్తూన్న ఈ ఉపన్యాసాన్ని సుగుణ వినడం జరిగి నెమ్మదిగా అక్కను ఆరాతీసింది మంచి మాటలతో. మాలతి తన ఆశనూ - ఫలితంగా పొందిన అనుభవాలనూ దాపరికం లేకుండా క్లుప్తంగా వివరించింది. "మీరంతా అదృష్టవంతులు చెల్లీ, బిడ్డా పాపలతో మీలాగా కిళకళలాడుతూండే యోగం ఏం పుణ్యా

చేస్తే వస్తుందో మరి ! ముత్యాలలా వున్నారు నీ బిడ్డలు. గతం తలుచుకుంటే అసలింక నాకు నిన్నడగడానికే నోరు రావడంలేదు."

వెంటనే సుగుణ ఏమీ మాట్లాడలేదు. బాగా ఆలోచించిన మీదట నెమ్మదిగా అన్నది : "నీ దగ్గర నాకు అభ్యంతరాలేమిటక్కా ? చూడు ... బాబు నీకు మాలిమి ఔతాడేమో ప్రయత్నించు. నే నిక్కడుండగానే నెమ్మది నెమ్మదిగా నీకు అలవాటు చేసుకుంటే వదిలేసి వెళ్తాను."

ఉప్పొంగిపోయింది మాలతి వింటూనే. "నాకు తెలుసు సుగుణా నీ హృదయం చాలా మంచిది. నీ ఋణం జన్మలో తీర్చుకోలేను." అంటూ చెల్లెలిని శ్లాఘించింది. సాయంత్రమే బజారుకు వెళ్ళి పిల్లలు ఊగేగుఱ్ఱం, తోపుడుబండి, కారు, రకరకాల బొమ్మలు, దుస్తులు కొనుక్కొచ్చింది.

భార్య ఉత్సాహాన్ని, ప్రయత్నాలనూ చూచిన రఘుపతికి భయం వేసింది. చాటుకు పిలచి అతి నిదానంగా చెప్పాడు. "చూడు మాలతీ, నేను నిన్ను తప్పు పట్టడంలేదు. నీ కోరికా, ఆశా సమంజసమైనవే కానీ పదే పదే అవమానాలకు గురికావడం ఎవరికైనా సహింప శక్యంకానిది. వెఱ్ఱి భ్రమకంటె ఆత్మగౌరవం ప్రధానం. గుర్తుంచుకో."

భర్త చేసిన హితోపదేశాన్ని భక్తిశ్రద్ధలతో విన్నదే కాని మాలతి పెదవి కదపి 'నా అభిప్రాయం యిదీ' అని ఏమీ చెప్పలేదు.

"వెళ్తాం, వెళ్తాం" అని ఏనాటికానాడే ప్రయాణమయ్యేవాళ్ళను "ఇంకా రెండు రోజులు, నాలుగు రోజులు"

అంటూ వాయిదాలు వేసి ఆపుతోంది మాలతి. ఈలోగా పిల్లలు మాలతికి కాస్త చేరువ అవ్వసాగారు. మోహనరావు తటస్థంగా వూరుకున్నాడు కాని సూరంమ్మ సణుగుడు ప్రారంభించింది ఆ చాటునా ఈ చాటునా.

"ఇదేం విడ్డూరమే ? నీకా ఉన్నదిద్దరు పిల్లలు, దాని మొఖం మండా 'ప్లెమిలూ, ప్లానులూ' అని ఇక పుట్టకుండా చేసుకున్నావ్ —"

"కాదత్తయ్యా "ఫామిలీ ప్లానింగ్ ?" సరిదిద్దింది సుగుణ.

"ఏదో దిబ్బ, కొంపలార్పడానికి ! పోనియ్. ఆ ఇద్దరిలోనే ఒకడిని పెంపకాని కివ్వడమేమిటంట ? నీకేం తినడానికి లేదా, ఉండటానికి లేదా ? ఏమంత ఖర్మొచ్చిందని మన బిడ్డ పరాయి కొంపల్లో పెరగాలీ ?" నిలదీసింది కోడలిని.

"పరాయి కొంప కాదు. నా స్వంత అక్క !" ధీమాగా అన్నది అత్తకి ఝడవని కోడలు. "పాపం సరదా పడుతోంది. ఎంత బాగా చూసుకొంటూన్నదో, ఎన్నెన్ని కొని తెచ్చిందో మీరే చూస్తున్నారుగా ? 'పెంపకం' అని పేరు పెడితే అదేదో పెద్ద గందరగోళంగా అన్పిస్తుంది కానీ మామూలుగా ఎందరి బిడ్డలు తాతగారిళ్ళల్లో - పిన్నమ్మ పెద్దమ్మల ఇళ్ళల్లో పెరగడంలేదూ ఏళ్ళకి ఏళ్ళూను ? మరీ దగ్గఱ దగ్గఱ కాన్పులై అంతా చిన్నచిన్న బిడ్డలే అయితే తల్లిని వేధిస్తారని దగ్గఱవాళ్ళు చేరదీసి పెంచడం మన ఇళ్ళల్లో క్రొత్తకాదుకదా ! పిల్లల్ని తల్లికంటె తల్లి తరఫు

వారే చక్కగా పెంచుతాకు ప్రేమపోసి! అంతెందుకూ - మీ అమ్మాయిల పిల్లలు మీ దగ్గరెన్నాళ్ళు పెరగలేదూ?"

"నీతో మాట్లాడి నెగ్గగలవాళ్ళెవర్లే!" మూలుగుతూ సాగదీసింది ముసలమ్మ. "అయినా నాకెందుకు? నీబిడ్డ - నీ పిత్తనం," తాత్కాలికంగా నోటికి తాళం వేసుకుంది.

మాలతి ఎక్కడవిన్నదోనని ఖంగారు పడుతూ వెళ్ళింది సుగుణ. అదృష్టవశాత్తూ ఆమె ఈ సంభాషణను వినలేదు. సుధను ఒళ్ళో కూర్చోబెట్టుకుని, గోపీని గుఱ్ఱమెక్కించి ఊగి స్తోంది, వాళ్ళతో మైమఱచి కబుర్లు చెప్తోంది. ప్రేక్షకురాలి కనులు భావాతీతమైన అనుభూతితో చమర్చాయి. 'పాపం! మనసులో దాగివున్న అనురాగ సుధనంతనూ ఈనాటికి లభిం చిన ఈ చిన్నారులపై వర్షిస్తోంది. రోజుకు నాలుగు జతల దుస్తులు మారుస్తోంది, వాళ్ళకి. షికార్లు త్రిప్పుతోంది. ఇక ఆటవస్తువులకు లెఖ్ఖేలేదు. ప్రత్యేకం వాళ్ళిద్దరి కోసం చెరో పని పిల్లనూ కుదిర్చింది. ఇంత ప్రేమగా చూస్తున్నామె దగ్గఱ ఎంతకాల ముంచితే మాత్రం లోటేముంది పిల్లలకి, లాభమేకాని?'

సుగుణ అలా తన తలపోతలలో తలమునకలై ఉండ గానే కాంతమ్మ వచ్చిందటు. "చూడండత్తయ్యా! ఈ సుధ ఎన్ని కబుర్లు చెప్తోందో! గడుగ్గాయి!" మురిసిపోతూ చూపిం చింది మాలతి.

ఈసడింపుతో కూడిన నిరసనతో చూచి, "దొరికిం దిలే గోతికొబ్బరి కాయలాగ! కడుపున పుట్టినాళ్ళు గను

కనా సర్వం ధారపోసి మురిసిపోవటానికి ?" అని మెటికలు విరిచి వెళ్ళిపోయింది.

మాలతి ఆ మాటలను లెక్క జేసుకోలేదు. "తన వైపువారిని పెంచుకోవడం లేదని ఆవిడ బాధ. ఆ ప్రియ త్నమూ అయ్యిందిగా ? ఈ నాటికి ఈ బిడ్డలకూ నాకూ ఏర్పడింది సంబంధం, ఏదో అనుబంధం ఉన్నది గనుక !"

"నిజం చెప్పావక్కా, ముసలాళ్ళకేమిటీ, ఏదో అలా వాగుతుంటారు. మనం సరకు జేసుకోకూడదు."

"అయ్యో. ఉండుండు." మాటల మధ్యలో ఖంగ రుగా లేచి పిల్లను పక్కన కూర్చోపెట్టేసింది మాలతి.

"ఏం, ఏమైంది ?" తానూ ఆత్ర పడింది సుగుణ. చూచి, "ఓస్, ఔటికి పోసిందా ? ఇంకా ఏమిటో అను కున్నాను." తేలికగా నవ్వేసింది. అప్పటికప్పుడు చీర మార్చుకు వచ్చిన అక్కను చూచి మరింత నవ్వింది సుగుణ. "కొన్నాళ్ళకి మామూలై పోతుందిలే అక్కా, నీకింకా అలవాటు లేదు కదూ మరి ? మాకు నిత్యం ఇవే అభిషేకాలు, ప్రసాదాలూను !"

కూతురి తడిసిన లాగును మార్చనైనా మార్చకుండా చంకన ఎత్తుకుని, గుబ్బిం ఊగుతూన్న కొడుకు ముక్కునుంచి కారుతూన్న చీమిడి తుడిచేసి ఆ చేయి చీరకు తుడిచేసు కుంటూన్న చెల్లెల్ని వెగటుగా చూచింది మాలతి. "ఇంత ఎడ్డిగా ఉంటేనే కాని పిల్లల్ని పెంచను వీలుపడదా ?" ఆలో చనలో పడ్డది.

అక్క భావాలను అర్థం చేసుకోని గలిగిన సుగుణ అతిసామాన్యంగా నవ్వేస్తూ, "ఏమిటో నక్కా, చిన్నప్పటి శుచిలూ, శుభ్రాలూ పిల్లలు పుట్టాక గుర్తుక్కూడా రావు. అసలవేం సాగవనుకో ఈ సముద్రంలో! ఎంతసేపూ ఈది ఒడ్డుకు జేరాలన్న తాపత్రయమే ?"

తనకంటె నాలుగేళ్ళు చిన్నదైన చెల్లెలు, కేవలం మాతృత్వమనే ఆధిక్యం కలదై తనకు ఈతి బాధలను వేదాంతిలా బోధిస్తూంటే ఏదో న్యూనతాభావం చెలరేగిన మాలతి అలా గుడ్లప్పగించి చూస్తూండి పోయింది.

## 6

రాత్రి పదకొండు గంటల సమయం.

బిగ్గరగా వినవస్తూన్న సుధ ఏడుపుతో మేల్కొంచి, ఏమి చేయుటానికీ తోచక కళ్ళు నులుముకుంటూ కూర్చుంది సుగుణ. ఒకటి ... రెండు ... అయిదు నిముషాలు గడిచింది. కాని మార్పు లేదు. పాప ఏడుపు తారస్థాయి నందుకొంటోంది. రెండ్రోజులుగా సుధను మాలతి తన గదిలోనే పడుకోబెట్టుకొంటున్నది.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను - ఎందుకలా మూల పిరాట్టులా కూర్చున్నావ్? సుధ ఇల్లెగిరి పోయేట్టు ఏడుస్తోంది. విన్పించటంలా ?"

మోహనరావు క్రోధస్వరం వింటూనే ఉలికిపడింది

సుగుణ. "మీ... మీ... మీరు మేలుకునే ఉన్నారా?" అన్నది తడబడుతూ.

"మేలుకుని లేను. బిడ్డ ఏడుపు వినిపించి మెలకువ వచ్చింది. నేనూ దాని కన్న తండ్రినేగా!"

సుగుణకు ఏమీ మాట్లాడలేని సందిగ్ధావస్థ వచ్చింది.

"అంతకంతకు గొంతు పొడారిపోతూన్నట్టు వినిపిస్తోంది, దాని ఏడుపు. వెళ్ళి తీసుకురా. ఆవిడెందుకు లేస్తుంది నిదర చెడగొట్టుకుని? కన్నకడుపు కాదుగా?"

"ఊరుకోండీ. అక్కయ్య -" ఏమో చెప్పబోయింది సుగుణ. కానీ, "చాలించు!" అని కసురుతూ మధ్యనే ఆపు జేసేడు మోహనరావు. "నువ్వు వెళ్తావా, నేను వెళ్ళి తీసుకురానా? అక్కయ్యట అక్కయ్య! ఆ బిడ్డలు లేనావిడ ముచ్చటకోసం మన బిడ్డను బాధించుకుంటామా? పిల్లలు ప్రక్కలో కాస్త కదిలేసరికే త్రుళ్ళిపడి లేస్తావే - అలా రాయిలా ఎలా కూర్చోగలుగుతున్నా విప్పుడు, అదంతగా ఇల్లు దద్దరిల్లేటు ఏడుస్తోంటే?"

గత్యంతరంలేక సుగుణ లేచి వెళ్తోండగానే, "ఏం సుగుణమ్మ తల్లీ?" అంటూ సూరమ్మ ఎదురు వచ్చింది కళ్లు నులుముకుంటూ. "పిల్లది అలా ఒక్క వరసన ఏడుస్తోంటే నీకిక్కడ నిద్రెలా పడ్తోందే? బిడ్డల్లేని గొడ్రాలికేం తెలుస్తుంది బిడ్డ నొప్పి? అదెందు కేడుస్తోందో ఏమిటో? లేవలేకట్లుం దావిడి ఖర్మ. వెళ్ళు. వెళ్ళి తీసుకురా యిటు."

రానురాను అధికమౌతున్న సుధ ఏడుపుతో సుగుణ మనసు కూడా పరితపించి వడివడిగా మాలతి గదివైపు నడిచింది. కిటికీలోంచి చూసింది. మాలతీ రఘుపతీ ఎవరిమట్టుకు వారు హాయిగా నిద్ర పోతున్నారు. ఉయ్యాలలోని సుధ నోరంతా తెఱచి, వచ్చినంత కంఠమూ పెట్టి బిగ్గరగా ఏడుస్తోంది.

"తలుపు తీయక్కా. అక్కా-" దబ దబా బాదింది తలుపుమీద సుగుణ.

రెండు నిముషాలకు తలుపుతీసి అపరాధినిలా నుంచుంది మాలతి. "ఏం, చాలా సేపట్నుంచి ఏడుస్తోందా ?" అనడిగింది అడగలేక అడగలేక.

మనసు మండిపోయింది సుగుణకు. ఏం మనిషి ? ఇప్పుడైనా కాస్త పిల్లని చేతుల్లోకి తీసుకోదేం ? పిల్లల్ని కంటే గాని ఆ ఆత్రతా మమతా వుండవు. దాని ఏడుపు విని నేను నిలవగలుగుతున్నానా? కసిగా తలపోస్తూనే చరచరా ఉయ్యాల దగ్గఱకు నడచి బిడ్డను చేతుల్లోకి తీసుకుంది. అప్పటికికూడా మేల్కొనని రఘుపతి గుఱక బాగా విన్పిస్తోంది.

"అరగంటనుంచీ ఏడుస్తోంది. ఏం కావాలో చూస్తాను. నువ్వు పడుకో అక్కా," అని గబగబా అనేసి తన గదిలోకి పోయింది సుగుణ. హృదయం చివుక్కుమన్న మాలతి క్షణం తటపటాయించి, సుగుణను అనుసరించింది నెమ్మదిగా.

సుగుణ దగ్గఱనుంచి ఆత్రంగా - ఏదో పెద్ద ప్రమాదం తప్పినంత సంరంభంతో బిడ్డను అందుకుంది సూరమ్మ. "అమ్మోనా తల్లీ, ఎంత ఏడ్చావే ఎంత ఏడ్చావే!" కనులు

తుడిచి ప్రేమగా శరీరమంతా నిమిరింది. "పాలసీసా ఇలా తీసుకురా" అంది కోడల్ని.

ఆమె చెప్పకముందే తీసుకువచ్చింది సుగుణ. మనుమరాలికి పాలు పడుతూ తీరికగా అప్పుడు కుమారుని దెస చూచింది వృద్ధురాలు. "చూడబ్బాయ్" అన్నది సంభాషణకు నాందీగా.

'ఏమి' టన్నట్లు చూచాడు మోహనరావు.

"చూస్తున్నావ్ కదా నువ్వే. పిల్లలులేక – పెంచుకోవాలని ఆవిడగారు పడే ఉబలాటానికి నేనేం అనను కానీ, ఆ పెంచే అర్హత మాత్రం ఆవిడకి లేదు. పిల్ల ప్రక్కనే పడి అంతగా ఏడుస్తోంటేనే మెలకువ రానిది ఇకేం పెంచుతుంది? నిద్ర సుఖం, తిండి సుఖం వుండవుమరి పిల్లల తల్లికి. 'నా నిద్ర నాది', 'నా సుఖం నాది' అనుకుంటే పిల్లలు పెరగరు. ఆవిడకు లేని లోటు తీర్చటానికి మన నోరులేని పిల్లని కష్టపెట్టుకోవటం నా కిష్టంలేదు మరి! బిడ్డ ఎంతగా ఏడ్చిందనీ, ఎంతగా ఏడ్చిందనీ!" పాలు తాగడం పూర్తిచేసి అప్పుడే నిద్రలోకి జారిపోయిన సుధ బుగ్గలు నిమురుతూ పక్కలో వేసుకొని తానూ నడుం వాల్చింది.

"ఆఁ. నేనూ అదే అనుకుంటున్నాను. రేపే వెళ్ళిపోదాంలే," అన్నాడు సాలోచనగా మోహనరావు.

గాభరాగా అటుయిటు చూచిన సుగుణ, గుమ్మంలో నుండి వెనుతిరిగి పోతూన్న మాలతిని చూచి క్రుంగిపోయింది.

ఆ తెల్లవార్లూ తన శయ్యపై పడి మాలతి మౌనంగా రోదించడం ఎవ్వరికీ తెలియదు.

# 7

పది రోజులుగా సందడిగా కళకళలాడిన యిల్లు నేడు నిశ్శబ్దంగా వెలవెల బోతూన్నది. పిల్లల కేకలూ, ఏడుపులూ లేవు. క్షణం తీరిక లేకుండా వున్నట్లనిపించే చాకిరీ లేదు. పిల్లల కోసమని కొన్న గుఱ్ఱం, ఊయెల బొమ్మలు ఇంటినిండా చిందరవందరగా వుండి తనను వెక్కిరిస్తూన్నట్లు అనిపించగా వెక్కి వెక్కి ఏడ్చింది మాలతి. వెళ్ళేటప్పుడు వాళ్ళూ తానూ కూడా ముభావంగానే వుండడంవల్ల, 'అవన్నీ పిల్లల కిచ్చి పంపుదాం' అనే ఆలోచనే రాలేదు తనకి. రాక రాక వచ్చిన వాళ్ళు కావటాన అందరికీ కలిపి నాలుగు వందలతో కాస్త మంచిబట్టలే యిచ్చి పంపింది.

“ఏమిటా కన్నీళ్ళు ? ఏమైనా పిచ్చిగానీ ఎక్కిందా?” ఎప్పటినుంచి పరికిస్తున్నాడో – రఘుపతి, భార్యను లాలనగా మందలించాడు. “నేను మొదటే హెచ్చరించాను మాలతీ నిన్ను. నువ్వు పెడచెవిన బెట్టావ్. కాస్త లోకాన్ని అర్థం చేసుకో,” ప్రేమగా ఆమె కనులు తుడుస్తూ అన్నాడు.

భర్తఅనునయంతో మాలతి దుఃఖం మరింత హెచ్చిందే కాని తగ్గలేదు.

“నడు. అలా చల్లగాలికి కాస్త తిరిగివద్దాం,” ఒక విధమైన బలవంతంతోనే భార్యను లేవదీశాడు.

లేక దగ్గఱ వచ్చేపోయే జనాన్ని చూస్తూ అన్యమనస్కంగా కూర్చుంది మాలతి.

"బాబూ ధర్మం. అమ్మా తల్లిలేని పిల్లలు పుణ్యముంటుంది. ధర్మం చేయి తల్లీ," బిచ్చగత్తె దీనంగా చేతులు మీదిమీదికి చాపి మరీ అడుగుతోంది.

"తల్లి లేనాళ్ళైతే ఏ పిల్లలు లేని వాళ్ళకో పారేయ్. పెంచుకుంటారు. వాళ్ళకోసం నీ కవస్థ దేనికీ మధ్యనా?" విసుగ్గా అన్నది మాలతి. "వెధవ ముష్టివాళ్ళు. కాస్సేపు ప్రశాంతంగా వుండనీయురు."

ఒక్క క్షణం విచిత్రంగా చూచింది అడుక్కొనే మనిషి. "మాలాటి మురికెదవల్ని ఎవరు పెంచుకుంటారు తల్లోయ్! బలేగా మాటాడుతుండారు మీరు!" అన్నది నవ్వేస్తూ.

"మరేం ఫర్వాలేదు. నడు, పెంచుకొనే వాళ్ళను నేను చూపిస్తాను," మనసు తిక్కగా ఉన్న మాలతి తన స్థాయిని మఱచి మాట్లాడుతోంది.

గుడ్లురిమి చూచింది భిక్షుకురాలు. తన అపురూపమైన వస్తువును దేన్నో ఎవరో లాక్కుపోతూన్నట్టుగా పిల్లల్ని దగ్గఱకు లాక్కుంది. "సాల్లేవమ్మా, ఓ పదిపైసాలు ధరమం పారేయటానికి ఏటేటో మాటాడతండావు! నాపిల్లలు సేదా ఏటి నాకు, నీ కిచ్చేదానికి?" నిరసనగా అనేసి వెళ్ళిపోయింది ఏమేమో తిట్టుకుంటూ. "పిల్లల్ని ఎవలికో ఇత్తే అడుక్కొచ్చి నా పొట్టపోసే దెవడింక?" అని కూడా అన్నది.

విజయగర్వంతో నవ్వింది మాలతి. "వాళ్ళు దాని పిల్లలేనని నాకు తెలుసు. 'తల్లిలేని పిల్ల'లని చెప్పి అడుక్కొం టోంది-జాణ ! బిచ్చమెత్తడంకోసం అసలు కన్నాళ్ళే చక్కటి పిల్లలకి కూడా చేజేతులా అంగవైకల్యం కల్పిస్తారని విన్నాను !"

"ఏదో తగలడతారు. మధ్య మనకెందుకాగోల ? నీ కసలు మతి భ్రమిస్తోం దానాటి కానాడు !" విసుక్కున్నాడు రఘుపతి.

ఇంటికి తిరిగి వచ్చేదారిలో పరిచితురాలు సీత ఎదు రైంది.

కుశల ప్రశ్నలు ప్రారంభమయ్యాయి.

"అసలు రావడమే మానేశావేమిటి మా యింటికి ?" అడిగింది మాలతి

"ఏదీ ? నేను నిన్ననే వచ్చా బెంగుళూరునుంచి. మా బావగారికి – అదే – వారి అన్నగారికి పిల్లల్లేరు కదూ ? మా అబ్బాయిని దత్తత తీసుకున్నారు. రెండు నెల్లైంది. ధ్యాన్న మారి వెళ్ళి ఓ పది రోజులుండి వచ్చాను."

"అలాగా ?" ఆశ్చర్యపోయింది మాలతి. "అయినా నీకున్నది ఆ ఒక్క కొడుకేకదా ! దత్తత ఎలా ఇవ్వగలి గావ్ ?" విస్మయంతో అడిగి-ది.

తేలికగా నవ్వేసింది సీత. "అందరూ అదే ప్రశ్న వేస్తున్నారనుకో. కాని చూడూ - వాళ్ళెవరో పైవాళ్ళని పెంపకం తీసుకుంటే ఆ స్తంతా వాళ్ళకే కదా ? అంచేత బాగా ఆలోచించే ఇచ్చాంలే. దత్తత వాళ్ళెవరో చేసు

ఉన్నంత మాత్రాన నా కడుపున పుట్టి పెరిగినవాడు నా కొడుకు కాకుండా పోతాడా? వెళ్తే మొన్న 'అమ్మా!' అంటూ వచ్చి చుట్టుకుపోయాడనుకో. చూడలేక తోటి కోడలు కళ్ళల్లో నిప్పులు పోసుకొంది. 'మాకు కాస్త అలవా టవ్వనీకుండా నువ్విలా అస్తమానూ వస్తే ఎలాగమ్మా? పిల్లాడు 'అమ్మ' అంటూ నీకోసం బెంగటిల్లిపోడూ? ఆ మాత్రం తెలిసి ప్రవర్తించకపోతే ఎలాగ?' అంటూ తెగ గొణిగింది... ఆవిడ అన్నదని నా బిడ్డని నేను వదులుకుంటానా, వెళ్ళడం మానతానా? ఇక వాళ్ళెంత గొణుక్కుంటే మాత్రం ఏం చేయగలరు? దత్త స్వీకార సమయంలో తీసిన ఫొటోలు ఉన్నాయి. ఆస్తి వ్రాతకోతలు కూడా అయిపోయాయి — అంతా మన పిల్లాడికేనని."

"పిల్లాడిని పెంచుకొంటే... అలా రాసివ్వాలా ఆస్తి పాస్తులు ముందుగానే?" అడిగింది మాలతి.

"ఆఁ. లేకపోతే ఇంతా మోసి కష్టపడి కనిపెంచిన బిడ్డని ఊరికేనా పరాయివాళ్ళ కిచ్చేస్తామటమ్మా? ఏమో - వీడు వెళ్ళిన తర్వాత - వీడి పాదం మంచిదై - వాళ్ళకో బిడ్డ పుడితే - వీడిని పొమ్మంటే ఏం చేస్తాం? అందుకని ముందే కట్టుదిట్టాలు చేసుకోవాలి. 'పుత్రులు లేక నరకానికి పోతాం- ఛస్తే పరాయివాళ్ళు తగలేస్తారేమో మనని మొక్కుబడిగా!' అని వాళ్ళ స్వార్థం వాళ్ళది. మా స్వార్థం మాదీ- వాళ్ళు కాస్త గుటుక్కుమంటే ఆ ఆస్తంతా మాకే కదా? మహారాజుల్లా బతకొచ్చు!"

నోటమాటలేక మాన్పడి గుడ్లప్పగించి చూడసాగింది మాలతి. ఆమె మనసున అవివేకమూ, మృదుత్వమూ తొలగి కొలదిగా వివేకమూ, గట్టితనమూ స్థానం పొందగలిగాయి.

సీత ఇంకా చెప్తూనే ఉంది తన పిల్లల గోల !

"వస్తాను మరి! పెద్దకూతురూ అల్లుడూ యింట్లో ఉన్నారు పండక్కొచ్చి. ఏమిటో ఏనాడో అయి పెళ్లైనా' ఇద్దరు బిడ్డల తండ్రైనా ఇంకా యీ నాటికీ 'అవి కావాలి' ఇవి కావాలీ' అనీ గొంతెమ్మకోరికలు ఆ అల్లుడుగారికి ఇదిగో - రెండు టెరిలీన్ సూట్లకి బట్టకొని తీసికెళ్తున్నాను' ముడుపు చెల్లించడానికి. లేకపోతే మళ్ళీ గడప త్రొక్కరని భయం !" చేతిలో బట్టలపాకెట్టు విప్పి చూపించింది. "మరి మనమ్మాయికి చీరపెట్టడం తప్పదు గదా ! 'అమ్మా కంచి పట్టుచీర కొనిపెడుదూ యీ పండక్కి' అని నోరు తెరిచి అడిగింది. చచ్చో బ్రతికో కొనవలసిందే కదా ! ఏమిటోనమ్మా మాలతీ ! ఒక్కొక్కప్పుడు 'పిల్లల్లేని వంధ్యుల జీవితమే మహా దొడ్డ !' అన్పిస్తుంది ఈ బాధలన్నీ పడలేక. రెండోదాని మొగుడికేదో జబ్బుచేసిందట-అది రమ్మని రాసింది. వెళ్లాలి. వస్తామరి !"

'పిల్లల్లేని వాళ్ళ బ్రతుకే మెరుగా? ఆమె నిజంగానే అన్నదా? లేక నన్ను ఓ పోటు పొడిచిందా?' ఇల్లు జేరినా మాలతి చెవులలో ఆమె మాటలే రొద చేయసాగాయి.

కట్టుగుడ్డం ఎక్కి వూగుతూ స్వర్గంలో ఉన్నట్టుగా సంతోషిస్తూన్న పనిమనిషి కొడుకు మాలతిని చూడగానే బెదరి పారిపోయాడు తల్లి చాటుకు.

“నేను చూళ్లేదమ్మగారూ, ఎదవ సన్నాసి ఎప్పుడు దాని దగ్గర జేరాడో! పొరపాటై పోయింది. మన్నించండి. ఎప్పుడూ దాని మొగమెరక్క సంబరమే కాని – మన బ్రతుకేటీ అన్న ఆలోశన లేదు!” కోపంగా గిన్నెలుతోమే మట్టి చేత్తోనే కొడుకును మొట్టింది.

“ఛ. ఏమిటే అవి?” మందలించింది మాలతి. “ఏరా రామిగా! అది కావాలా?”

వాడు ఆశగా చూస్తూ తల ఊపాడు.

“ఊరుకోండమ్మా, మా గుడిసెలో దానికూడా చోటుందా?”

“లేదే, నిజంగానే అంటున్నాను. వాడు సరదా పడుతున్నాడు పాపం. తీసికెళ్ళు. ఇక్కడెందు కది?”

పైడి ముఖం విరిసిన దరిశనపూవులాగైంది. “అమ్మగారు మహాలచ్చిమ్మతల్లి. దేవుడు సల్లగా సూత్తాడు!” అంటూనే గుత్తాన్ని అవలీలగా భుజంమీద కెక్కించేసుకుని రెండో చేత్తో కొడుకును నడిపించుకుంటూ పోయిందె, “సుట్టాలెక్కువై పనెక్కువైనాది ఈ పదిరోజుల్నించీ. మరో ఐదు రూపాయలు అదనంగా రావాల!” అంటూ ఆ ఉదయమే ఖండితంగా వసూలుచేసిన పైడి.

క్రమక్రమంగా కనుమరుగై పోతూన్న ఆ తల్లీబిడ్డలనూ, కల్లిగుత్తాన్నీ నిర్నిమేషదృక్కులతో చూస్తూ తనలో తాను నిర్మలంగా నవ్వుకొన్నది మాలతి.